# కర్నూలు | నంద్యాల వార్త

29 జూన్, 2023 గురువారం పేజీలు 4


## కార్మిక సంఘాలకు టిడిపి అండగా ఉంటుంది : టీజీ భరత్



**కర్నూలు న్యూసిటీ, జూన్ 28, ప్రభాతవార్త:** కార్మిక సంఘాలకు టిడిపి అండగా ఉంటుందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ టీజి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని మౌర్య ఇన్ ఫంక్షన్‌హాల్‌లో టిఎన్‌టియుసి అధ్వర్యంలో అన్ని కార్మిక సంఘాలతో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో టిజీ భరత్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తమకు తెలియజేస్తే తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఈవిషయాన్ని క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అందరు కలిసి కట్టుగా ఉండి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక సంఘాలు ఎదురొ్కంటున్న ప్రధాన సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్త మన్నారు. టిడిపి మేనిఫెస్టోలో ఈసమస్యలను ప్రకటించి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. టిఎన్‌టియుసి కర్నూలు, నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు నరసింహులు, అజీజ్, నేతలు అశోక్, ప్రభాకర్, రామకృష్ణ, శ్రీనివాసులు, మోహన్‌రావు పాల్గొన్నారు.



## మహా సంకల్పానికి.. దృఢ చిత్తానికి నిదర్శనం..

# తొలి ఏకాదశి..!

"సాధారణ ధ్యానానికి, యోగ నిద్రకు తేడా ఉంది..ఈ రెండింటి సమ్మేళనంతో సమాధి స్థితికి చేరవచ్చు..ఈ స్థితిలో ఉన్నప్పుడే శ్రీ మహా విష్ణువు తాను చేసిన సృష్టి సంరక్షణ విషయాలన్నింటినీ తనలో తాను సమీక్షిస్తాడు"..మహా సంకల్పానికి, దృఢ చిత్తానికి నిదర్శనంగా తొలి ఏకాదశి నిలుస్తోందని పురోహితుల భావన..భారతదేశం పురాణాలకు, ఇతిహాసాలకు పుట్టినిల్లు.. హిందువులు ప్రతి పండుగను శుభప్రదంగా జరుపుకుంటారు". ప్రతి నెల పండుగ ఉంటేనే హిందువుల ఇండ్లు కళకళలాడుతాయి. ఇలాంటి పండుగల్లో హిందువులకు శుభప్రదముల ఫలాలను అందించే రాశిగా తొలి ఏకాదశిని పేర్కొనవచ్చు.. ఎందుకంటే దేవతలు విశ్రమించేరోజు ఇది. ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా చేసుకుంటారు.. దీనినే శయన ఏకాదశి అని కూడా అంటారు..సంప్రదాయబద్ధంగా చేసుకునే గొప్ప పర్వదినం ఇది..ఈ రోజునే శ్రీ మహావిష్ణువు శయనిస్తాడని, మళ్లీ కార్తీక శుద్ధ ఏకాదశి(ప్రబోధిని ఏకాదశి) నాడు నిద్ర నుంచి మేల్కొంటాడని పూజారులు తెలియజేస్తున్నారు. ఈ నాలుగు మాసాలు (చతుర్మాస్యం) మహా విష్ణువు యోగనిద్రలో ఉంటాడని హిందువుల ప్రగాఢ విశ్వాసం..కావున భక్తులను గమనించే రోజుగా తొలి ఏకాదశిని గుర్తించి దేవుళ్ళు నైవేద్యం ఆరగించి భక్తులకు ఆశీర్వాద ఫలాలు ఇచ్చేరోజు కావడంతో హిందువులు ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. ఉగాది, శ్రీరామనవమి పండుగల తర్వాత దాదాపు మూడు నెలల పాటు హిందువులకు పండుగలు ఉండవు. దీంతో ఏకాదశి నుండే అన్ని పండుగలు ప్రారంభమవుతాయి. అందుకే ఇది పండుగలు వెంటతెచ్చే దానిగా ఆరాదిస్తారని జ్యోతిష్య పండితులు తెలుపుతున్నారు....

2లో

*కోసిగి, ప్రభాతవార్త :*

## సంక్షోభంలో పత్తి పరిశ్రమ..!

- దాదాపు రూ.200కోట్ల వ్యాపారం నష్టం..
- అంతర్జాతీయ మార్కెట్‌లో పడిపోయిన పత్తి డిమాండ్
- గత ఏడాది క్వింటాల్ ధర రూ.12వేలు పలుకగా..
  ఈ ఏడు రూ.7వేలకు మించడం లేదు..

• వివరాలు 2లో



**ఆదోని, జూన్ 28, ప్రభాతవార్త**

పత్తి గింజలు సైతం వేలబస్తాలు నిల్వ ఉన్నాయి. బయ్యర్స్ కొన్న ధరలతో పోలిస్తే ఇప్పుడు సగంకు పైగా ధరలు పడిపోయాయి. కోయం బత్తూరు, గుంటూరు ప్రాంతాలలోని స్పిన్నింగ్ మిల్లులకు ఇప్పటికే వేల క్వింటాళ్ల బేళ్లు అమ్ముకున్నారు. అయితే దానికి సంబంధించి సుమారు రూ.70 నుండి రూ.80 కోట్ల వరకు పేమెంట్‌లు నిలిచి పోయాయి. అక్కడి మిల్స్ ఫెయిల్,యారల్ (దారం) ధరలు పడిపోవడంతో అక్కడి స్పిన్నింగ్ యజమానులు కూడా నష్టాల్లో మిగిలిపోయారు. ఆదోనిలో 50 వరకు ప్రెస్సింగ్ అండ్ స్పిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఇందులో 20కి పైగా పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి. ప్రెజెంట్ 25శాతం ఫ్యాక్టరీలు మాత్రం రన్నింగ్‌లో ఉన్నాయి. మినిమమ్ కరెంటు బిల్లులు, ఫైనాన్స్ వడ్డీలు, స్టాఫ్ మెయిన్‌టెనెన్స్‌కి కూడా జరుగక కోట్లలో నష్టం ఏర్పడింది. అంత ర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధరలు బాగా తగ్గడంతో రైతులు కూడా లక్షల క్వింటాళ్ల పత్తిని ఇళ్ల వద్దనే స్టాక్ పెట్టుకున్నారు.



ఆదోని వ్యవసాయ మార్కెట్ రాయలసీమలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్దిగాంచింది. ముఖ్యంగా గుంటూరు తర్వాత పత్తి వ్యాపారానికి ఆదోని మార్కెట్‌యార్డు పెట్టింది పేరు. అలాంటి పత్తి మార్కెట్ నేడు సంక్షోభంలో కూరుకుపోయింది. అపార ఆర్ధిక నష్టాలతో పత్తి జిన్నింగ్ నిర్వాహకులు కుదేలవుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధరలు అమాంతం పడిపోవడంతో జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీల మనుగడ అగమ్యగోచరంగా మారింది. గత ఏడు దూది ధర సుమారు రూ.లక్ష నుండి రూ.1లక్ష20వేలు పలికింది. ప్రస్తుతం దూది ధర రూ.60వేలకు మించి లేదు. అదేవిధంగా పత్తిగింజలు లాస్ట్ ఇయర్ రూ.38వేలు పలుకగా ఈ ఏడాది రూ.23వేలకు పడిపోయింది. గిట్టుబాటు ధరలు లేని కారణంగా ప్రతి ఫ్యాక్టరీలో 60వేల క్వింటాళ్ల వరకు పత్తి బేళ్లు స్టాక్ ఉండిపోయినాయి.

## ప్రజా మన్ననలు పొందాలి

: పెండింగ్ కేసులను చేధించాలి...
: కేసుల దర్యాప్తులు వేగవంతం చేయాలి
- డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి



**కర్నూలు, జూన్ 28, ప్రభాతవార్త :** ప్రజల మన్ననలు పొందే విధంగా పోలీసుల పనితీరు ఉండాలని రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి పోలీసులకు సూచించారు. బుధవారం కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌ను, సిఐడి (రీజనల్ ఆఫీస్) ప్రాంతీయ కార్యాలయంను ఆయన పరిశీలించారు. ముందుగా బెటాలియన్‌లో పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సంధర్భంగా కర్నూలు 2 వ బెటాలియన్ లోని 8 కంపెనీల మెన్ డెప్లాయ్ మెంట్ ఫోర్సు గురించి , పోలీసు ఎస్కార్ట్ ల బందోబస్తు గురించి డిజిపి ఆరా తీశారు. అనంతరం సిఐడి ఆఫీసును పరిశీలించారు. సిఐడి ఆఫీసుకు కావలసిన రిక్వైర్ మెంట్స్ ( వాహనాలు, నిర్మాణాలు) , పోలీసు సంక్షేమానికి తీసుకోవలసిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఉన్న ప్రాధాన్యత గల కేసుల పై దర్యాప్తులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిజిపితో పాటు కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్, రెండో బెటాలియన్ డీఐజీ సిహెచ్ . వెంకటేశ్వర్లు, కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఏపీఎస్పీ కమాండెంట్ , సిఐడి డిఎస్పీలు ఉన్నారు.

## నవశకానికి నాంది విద్యావ్యవస్థలో మార్పులు

- దేశంలోనే అమ్మఒడి పథకానికి అపూర్వ స్పందన
- రూ.217.20 కోట్లు జిల్లాలోని తల్లుల ఖాతాలో జమ
- జిల్లా కలెక్టరు

2లో



**నంద్యాల విద్య, జూన్ 28, ప్రభాతవార్త:** పిల్లల చదువులకు పేదరికం అడ్డుకాకూడదన్న ప్రధాన ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టిందని ఈపథకం ద్వారా పేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదవాలన్న ఆశయాన్ని రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టారని విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ప్రక్షాళన చేయడం నవశకానికి నాంది పలికినట్లని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని విసి కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో రాష్ట్రవ్యాప్తంగా 1 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లను కంప్యూటర్ బటన్‌నొక్కి జమచేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరుతో పాటు ఎమ్మెల్సీ ఇసాక్‌బాష, మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మైనార్టీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హాబిబుల్లా, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర హస్తకలల డైరెక్టరు సునీత అమృతరాజ్‌లు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కె సుధాకర్‌రెడ్డి అధ్వర్యంలో జగనన్న అమ్మఒడి పథకం కార్యక్రమం కింద అర్హతగల తల్లులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున 1,67,084 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.217.20 కోట్లు మొత్తాన్ని నేరుగా జమచేశారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ చదువు అనే ఆయుధం విద్యార్థులను నూతనోత్సవాన్ని నింపే కార్యక్ర

## జగనన్న అమ్మఒడి పథకం దేశంలో ఏ రాష్ట్రంలో లేదు..!

**కర్నూలు రూరల్, జూన్ 28, ప్రభాతవార్త**

జగనన్న అమ్మఒడి పథకం మన దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేదని జిల్లా కలెక్టర్ సృజన, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌లు అన్నారు. బుధవారం మండలంలోని నందనపల్లి గ్రామ పంచాయతీ మిలిటరీ కాలనీ గ్రామం నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మండల ఎంపిపి డి వెంకటేశ్వరమ్మలు జగనన్న అమ్మఒడి పథకం కింద నగదును తల్లుల ఖాతాలో జమచేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం వరుసగా నాల్గవ సారి జగనన్న అమ్మఒడి పథకాన్ని కొనసాగించడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వం విద్య మీద వేల కోట్లను ఖర్చు చేసి విద్యా వ్యవస్థను పటిష్టం చేసి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, మద్యాహ్న భోజనం ఇలా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి విద్యా వ్యవస్థకు కొత్త రూపు తీసుకొచ్చిందన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పాఠశాలలు ఎలా ఉన్నాయో ప్రజలందరు గమనిస్తున్నారన్నారు.



నాడు-నేడు పథకం ద్వారా వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా తయారు చేశారన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిందని మన ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాలలను ఎంతో అహ్లాదకరంగా తీర్చిదిద్దడం సిఎం జగన్‌కే సాధ్యపడిందన్నారు. రాష్ట్రంలోని పిల్లలందరికి సిఎం జగన్ ఒక మేనమామలాగా అమ్మఒడి అనే కార్యక్రమం ద్వారా రూ.15వేల నగదును వారి తల్లి ఖాతాలో జమచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రామకృష్ణ, ఎంపిటిసి జ్యోతి, సర్పంచ్ మాదురి, డిఓ రంగారెడ్డి, ఏపిసి వేణుగోపాల్, మిలటరీ కాలనీ గ్రామ ప్రజలు, వైసిపి నాయకులు పెద్దఎత్తున పాల్గొనా న్నరు.

## త్యాగాల పండగ...

# బక్రీద్ నిండుగ..!

- బక్రీద్‌తోనే హజ్ యాత్రకు ముస్లింల శ్రీకారం..
- త్యాగాభావాన్ని మానవుల్లో జనింప చేయడమే బక్రీద్ పరమార్థం..

భారతదేశం సర్వమతాల సమ్మేళనం.. ప్రతీ మతానికి ఏవో కొన్ని ఆచారాలు, పద్దతులు వ్యవహారశైలి లుంటాయి. అందులో భాగంగా ప్రజలు ఆయా సంప్రదాయ వ్యవహారాలు పాటిస్తూ, ఆనందిస్తు ఉంటారు. అలా ఇస్లాం మతస్థులు జరుపుకునే పండుగలలో ముఖ్యమైనవి రెండు. అవి 1. ఈదుల్ ఫిత్తర్(రంజాన్), 2.ఈదుల్ జుహా(బక్రీద్).. ఈదుల్‌ఫిత్తర్ ముస్లింలకు అతి పవిత్రమైన పండుగ. దీని అర్థం ఉపవాసదీక్ష తరువాత జరుపుకునే సంబరం అని. ఈ పండుగను ముస్లిం క్యాలెండర్ ప్రకారం తొమ్మిదో నెలలో జరుపుకుంటారు. ఎంతో నియమ నిష్టలతో ఉపవాసదీక్షలను ప్రారంభించి, మాంసంతో పాటు వాటిని అమలు పరిచి, దైవ ప్రార్ధనలు చేస్తారు.

2లో

*కోసిగి, ప్రభాతవార్త :*



## కళ్లుండి కబోదుల్లా వ్యవహరించడం సరికాదు :మంత్రి బుగ్గన



**బేతంచెర్ల, జూన్28, ప్రభాతవార్త:** ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేసేటప్పుడు కళ్లుండి కూడా కబోదుల్లా వ్యవహరించడం తగదని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి అన్నారు.బుధవారం బేతంచెర్ల నుండి కర్నూలు వెళ్లు రహదారిలోని కనుమాంజనేయస్వామి గుడి సమీపంలో ఆటోనగర్‌కు భూమిపూజ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ శేషారెడ్డి హైస్కూల్ నాడు శేషారెడ్డి బేతంచెర్ల మండల పరిస్థితిని బట్టి వర్షాధారం పై మాత్రమే జీవించాలనే ఉద్దేశ్యంతో పారిశ్రామికంగా విద్య, వైద్యపరంగా అభివృద్ధి చేయడం, ఉపాధి కోసం మంచి విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో స్వాతం త్ర్యానికి ముందే శేషారెడ్డి ఉన్నత పాఠశాలను నిర్మించడం జరిగిందన్నారు. ప్రస్తుతం పాలి టెక్నిక్ కళాశాల, స్కిల్‌డెవలప్‌మెంట్, ఐటీఐ, డ్రోన్ శిక్షణ తరగతులు వంటి అనేక విద్యా సంస్థలు ఇందులో నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు.వీటన్నింటిని చూసికూడా కళ్లులేని కబోదుల్లా బుద్ధిహీనతతో ప్రతిపక్ష నాయకులు శేషారెడ్డి స్కూల్‌లో ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారని ఆరోపించడం తగదన్నారు. బేతంచెర్లలో మీసముండి రోషమున్న ప్రజలందరూ ఆరోపించే నాయకులు బేతంచెర్లకు వస్తే చేయి పట్టుకుని లాక్కొని వెళ్లి శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఏం జరుగుతుందో చూపించాలని ఆయన అన్నారు.ఆటోనగర్ నిర్మాణం వల్ల రహదారుల వాహన రద్దీ తగ్గడంతోపాటు వాహనదారులకు శ్రమ తగ్గి అన్ని విధాలుగా ఉపాధి పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు.ఆటోనగర్ మొదటి విడతగా రూ.6.90 ఎకరాల్లో బేతంచెర్ల ఆటోనగర్ టెక్నికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమవుతాయన్నారు. మొత్తం 20 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధి ఎక్కడని ఆరోపిస్తున్నాయని బేతంచెర్ల చుట్టు రహదారులు, విద్య కోసం కళాశాలలు, ఉపాధి కోసం సాంకేతిక కళాశాలలు, వైద్యం కోసం బేతంచెర్లలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, డోన్‌లో వంద పడకల ఆసుపత్రి, ఉపాధిశిక్షణలో భాగంగా షిప్పింగ్‌యార్డు, వెటర్నరీ ట్రైనింగ్ కళాశాల, ఎంఎస్‌ఎంఈ కళాశాల, పాలిటెక్నిక్ ఐటీఐ కళాశాలలు స్థాపించడం జరిగిందని వీటిలో దాదాపు చాలా వరకు ప్రారంభించడం జరిగిందన్నారు.ఇన్ని చేస్తున్నా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణల్లో నిజంలేదని ప్రజలు ఇప్పటికే గుర్తించారన్నారు.ఇప్పటికైనా ఎవరు పనిచేస్తున్నారన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని 2014, 2019 ఎన్నికల్లో మీరు సహకరించడం వల్లే వీటన్నింటని అభివృద్ధి చేసుకోవడం జరిగిందని 2024లో మీ అభివృద్ధిని కాంక్షించేవారినే ఎన్నుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జడ్.ఎం.విశ్వేశ్వరయ్య, వి.జడ్.ఎం.కృష్ణమోహన్, పీఎం సందీప్, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలంరెడ్డి, ఉర్దు అకాడమీ డైరెక్టర్ ముర్తుజావలి, వక్ఫ్‌బోర్డు మెంబర్ ఖాజా హుస్సేన్, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, వైసీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, ఆటోనగర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరారెడ్డి, సెక్రటరీ , ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



## సార్.. మీరు ఏ పార్టీ అంటూ ఎమ్మెల్యేను ప్రశ్నించిన ఉప సర్పంచ్

**మిడుతూరు, జూన్28, ప్రభాతవార్త ;** మండలంలోని పైపాలెం గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎమ్మెల్యే తోగరు ఆర్థర్ ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజా సంక్షేమ పథకాలకు మంజూరైన నిధుల వివరాలు వివరిస్తున్నారు. అదే సమయంలో ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గీయుడు గ్రామ ఉప సర్పంచ్ రామకృష్ణ అనే వ్యక్తి జోక్యం చేసుకొని ఎమ్మెల్యేను ఉద్దేశించి మాట్లాడుతూ సార్ మీ వెంట తిరుగుతున్న శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఇటీవల టీడీపీ పార్టీ యువగళం పాదయాత్రలో పాల్గొన్నాడని, అదేవిధంగా గౌరు వెంకట్‌రెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిలతో సన్నిహితంగా తిరుగుతున్నాడని, అటువంటి వ్యక్తి మీ వెంట తిరుగుతున్నాడు అన్నారు. రాత్రి, పగలు కష్టపడి సార్ మీకు ఓటు వేశాము, మా బాధలు మాకు తెలుసు. అసలు మీది ఏ పార్టీ అంటూ ఎమ్మెల్యేను ఉప సర్పంచ్ ప్రశ్నించారు. ఏదైనా పరిష్కారం చేయాలా సార్, లేదంటే పార్టీకి చెడ్డపేరు వస్తుంది అంటూ ఉప సర్పంచ్ చెప్పగా, ఏమి చేయాలి మీరు ఎవరు రాకపోతే మిమ్మల్ని ఎవరు దూరం పెట్టారు అంటూ ఎమ్మెల్యే తిరిగి ప్రశ్నించారు. మేము మీకు అంతా చేసి మద్దతు ఇచ్చి మీ దగ్గరికి వస్తే మీరు ఎవరిని ప్రశ్నిస్తే ఎలా అంటూ ఎమ్మెల్యేను ఉప సర్పంచ్ తిరిగి ప్రశ్నించారు. దీంతో మీరు రాకపోతే ఎవరు ఏమి చేయలేరని అంటూ ఎమ్మెల్యే ముందుకు కదిలారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఇనాయతుల్లా, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అపర కర్మల భవనం కమిటీకి అప్పగింత

**కర్నూలు, జూన్ 28, ప్రభాతవార్త :** బ్రాహ్మణ జీవితంలో పుట్టుక ఎంత ముఖ్యమో... మరణానికి కూడా అంతే ప్రాముఖ్యత ఇస్తారు. ముఖ్యంగా మరణానంతరం ఉత్తరక్రియలు జరిపే విషయంలో ఖచ్చితమైన నిష్ట నియమాలతో కార్యక్రమం నిర్వహిస్తారు. అలాంటి కార్యక్రమాలు నిర్వహించే బ్రాహ్మణ అపర కర్మల భవనమును బుధవారం బ్రాహ్మణ కమిటీకి అప్పగించారు. ఇది చాలా శుభ పరిణామం అని బ్రాహ్మణ కమిటీ ప్రముఖులు ఆనందం వెలిబుచ్చారు. ఉత్తరక్రియలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన భవనం ఇంతకాలం సరైన నిర్వహణ లేక సౌకర్యాల లోపంతో ఉంది. ఆ భవనాన్ని, నిర్వహణను కమిటీకి ఇవ్వాలని కర్నూల్‌లోని బ్రాహ్మణులు చాలా కాలంగా కోరుతున్నారు. అయితే పలు కారణాలతో ఆ కార్యక్రమం ఆలస్యమైంది. ప్రస్తుతం కర్నూలు శాసనసభ్యులు హాఫీస్‌ఖాన్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బి వై రామయ్య చొరవతో బ్రాహ్మణ అపర కర్మల భవనమును బ్రాహ్మణ కమిటీకి అప్పగించారు. ఆ మేరకు ఎమ్మెల్యే అధికారిక పత్రాన్ని కమిటీ ముఖ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు, కర్నూలు నగర బ్రాహ్మణ అపరకర్మల భవన నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఎన్ వెంకటరామరాజు మాట్లాడుతూ... కర్నూలు నగరంలో అపరకర్మల భవనం కమిటీకి అప్పగించే విషయంలో చాలా ప్రయత్నాలు చేశామని ఎమ్మెల్యే సహకారంతో సాకారం అయిందన్నారు. ఇలా భవనం కమిటీకి అప్పగించడం చాలా శుభ పరిణామం అని ఆయన వివరించారు. బ్రాహ్మణుల జీవితంలో పుట్టుక ఎంత ముఖ్యమో మరణం కూడా



అంతే ముఖ్యంగా భావిస్తారని తెలిపారు. మరణం తర్వాత జరిపే శాస్త్రోక్తమైన ఉత్తరక్రియలు నిర్వహించే విషయంలో ఖచ్చితమైన కట్టుబాట్లు ఉంటాయన్నారు. ఇంతకాలం సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు అపరకర్మల భవనం నిర్వహణ కమిటీకి అప్పగించడంతో సౌకర్యాల లేమిని అధిగమిస్తామన్నారు. ఈ విషయంలో మాజీ శాసన సభాపతి కోణా రఘుపతి అందించిన సహకారం మరువలేనిది అన్నారు. అదేవిధంగా కర్నూలు నగర మేయర్ కమిటీకి సహకారం ఇవ్వడం సంతోషం అన్నారు. భవనాన్ని కమిటీకి అప్పగిస్తున్నట్లు ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్ అధికారిక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా హాఫీస్ ఖాన్ మాట్లాడుతూ బ్రాహ్మణుల చిరకాల కోరిక అయినా బ్రాహ్మణ అపర కర్మల భవనమును బ్రాహ్మణ జాతికి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను తన చేతుల మీదుగా ఇవ్వటం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే తెలియజేశారు. అదేవిధంగా కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి మంకాల కృష్ణకాంత్ మాట్లాడుతూ తమకు సహకరించిన నగర మేయర్ కు, రెవెన్యూ అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు, కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు మామిళ్ళపల్లి రాజేష్, సంయుక్త కార్యదర్శి హరిహరనాథ దేవి ప్రసాద్, కోశాధికారి నూనెపల్లి కృష్ణమూర్తి, కమిటీ కార్యవర్గ సభ్యులు మామిళ్ళపల్లి విజయకుమార్, అమరవాది విజయ సారథి మరియు నగర బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

# త్యాగాల పండగ...బక్రీద్ నిండుగ..!

(మొదటి పేజీ తరువాయి ) :

**త్యాగధనుల పండుగ బక్రీద్:-**
ఈదుల్ ఫిత్తర్ తరువాత రెండు నెలలకు ఈదుల్ జుహా(బక్రీద్) వస్తుంది. "ఈదుల్‌జుహా" మనిషి యొక్క త్యాగ నిరతిని గురించి తెలియజేసే పండుగ. అందుకే దీనిని 'త్యాగాల పండుగ' అని అంటారు. దీనికే మరో పేరు 'బక్రీద్'. ఈ పండుగను ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 12వ నెల అయిన 'జిల్‌హాజ్జ' లోని పదో తేదిన జరుపుకుంటారు. అంటే ఈ నెల 29 తేది గురువారం బక్రీద్ జరుపుకుంటారు.. బక్రీద్ అంటే 'బకరా, ఈద్', బకరా అంటే 'జంతువు', లేక గొర్రె అని, ఈద్ అంటే పండుగ. ఈ క్రమంలో జంతువు(గొర్రె)ను బలి ఇచ్చే పండుగ కనుక ఈ పండుగను 'ఈదుల్-ఖుర్బానీ' అంటారు. ఖుర్బానీ అంటే దేవుని పేరుతో పేద వారికి జంతువు మాంసం దానం ఇవ్వటం.

**చరిత్రను పరిశీలిస్తే:** అల్లాహ్ ముఖ్య ప్రవక్త అయినటువంటి హజ్రత్ ఇబ్రహీం ఇరాన్‌కు చెందిన వాడు. ఇతడు ఇస్లాం విశ్వాసాలను ప్రపంచమంతా ప్రచారం చేస్తూ కాలి నడకన తిరుగుతూ ఉండేవాడు. ఇబ్రహీంకు వివాహం అయినప్పటికి చాలా ఏళ్ల వరకు సంతానం కలుగలేదు. సంతానం కోసం ఇబ్రహీం మరో వివాహం చేసుకుంటాడు. అయినా వీరికి సంతానం కలుగలేదు. ఒక రోజు దైవవాణి అల్లాహ్‌తో మాట్లాడుతూ సంతానాన్ని కలిగించమని కోరుతాడు. అల్లాహ్ ప్రవక్త కోరికను మన్నించి పండంటి మగ బిడ్డను ప్రసాదిస్తాడు. అతడి పేరు 'ఇస్మాయిల్. హజ్రత్ ఇబ్రహీంకు ఇస్మాయిల్ అంటే ఎనలేని ప్రేమాభిమానాలు.. ఒకరోజు ఇబ్రహీం నిద్రిస్తున్న సమయంలో ఆయన కలలో అల్లాహ్ కనిపించి "నీ కుమారుడిని నాకు బలి ఇవ్వు"మని కోరాడు. నిద్ర నుంచి మేలుకున్న ఇబ్రహీం తన కుమారుడైన ఇస్మాయిల్‌కు ఈ సంగతి తెలియజేశాడు. సహజంగా దైవభక్తుడైన ఇస్మాయిల్ అందుకు 'సరే' అన్నాడు. దీంతో ఇస్మాయిల్‌ను తీసుకుని వెళ్లి దేవునికి బలి ఇచ్చే విషయంలో ఇబ్రహీం తన కత్తితో ఇస్మాయిల్ మెడను రెండు సార్లు కోస్తాడు. కానీ, మెడ తెగదు. అప్పుడు ఇస్మాయిల్ తండ్రితో... నాన్నగారు మీరు నాపై ప్రేమతో మెడను కోయలేక పోతున్నారు. నీ కళ్లకు బట్ట కట్టుకుని కోయమని చెబుతాడు. మూడో సారి కళ్లకు బట్ట కట్టుకుని ఇబ్రహీం, ఇస్మాయిల్ మెడను కోసినప్పటికి అది తెగదు. అప్పుడు అల్లాహ్ దైవవాణి ద్వారా ఇబ్రహీం 'ఇది నిన్ను పరీక్షించడానికి మాత్రమే'. 'నా పరీక్షలో నీవు నెగ్గినావు. ఇప్పుడు నీవు ఒక బకరాను ఖుర్బానీగా ఇవ్వు' అని చెప్పి ఒక గొర్రెను సృష్టించాడు. ఆనాడు ఇబ్రహీం దేవునికి గొర్రెను సమర్పించినందుకు ఆనాటి నుంచి జంతువును ఖుర్బానీ ఇవ్వడం ఇస్లాం సాంప్రదాయంలో ఆనవాయితీగా మారింది. అదే బక్రీద్..

**బక్రీద్ రోజున ముస్లీంల ప్రత్యేకత:**
బక్రీద్ రోజుకు ముందు రోజున చనిపోయిన వారి సమాదుల దగ్గరకు వెళ్లి అక్కడ వారికి ఇష్టమైన దుస్తులు, ఆహార పదార్థాల వస్తువులను ఉంచుతారు. వారు స్వర్గం నుంచి వచ్చి వాటిని భుజిస్తారని, స్వీకరిస్తారని, స్వీకరించి తమను ఆశీర్వాదిస్తారని ముస్లీంలు నమ్ముతారు. ఈ పండుగ రోజున నెమరు వేసే జంతువులను (ఒంటే,మేక,గొర్రె,ఎద్దు) మాత్రమే ఖుర్బానీ(బలి) ఇస్తారు. బలి ఇచ్చిన తరువాత దానిని మూడు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు పంచుతారు. ఇంకొక భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. ముస్లీంల త్యాగానికి ప్రతీకకగా ఈ బక్రీద్‌ను జరుపుకుంటారు. ఆ తరువాత ముస్లీం సోదరులందరు కలసి 'ఈద్‌గా' అనే ప్రత్యేక ప్రార్థన స్థలంలో ప్రార్థనలు జరుపుతారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు జరుపుకుంటారు.

**ముస్లీంల తీర్థయాత్ర హజ్:**
బక్రీదు నెల ప్రారంభం నుంచే హజ్ యాత్ర ప్రారంభమవుతుందని ముస్లీంల మత గురువులు ఇమామ్‌లు తెలుపుతున్నారు. ఈ నెలలో హజ్ యాత్ర చేస్తే పుణ్యం వస్తుందని ముస్లీంలు నమ్ముతారు. బక్రీదు పండుగ రోజున ముస్లీంల పవిత్ర స్థలమైన మక్కాలో హజ్ యాత్ర లక్షాలాది మందితో జరుగుతుంది. హజ్ అంటే అరబ్బీ భాషలో 'యాత్ర' అని అర్థం. అక్కడ పవిత్రంగా ఉన్న 'కాబా' గృహాన్ని దర్శించే సంకల్పంతో ఈ హజ్ యాత్రను చేస్తారు. నాడు ఇస్లామియా బోధనలను వ్యాపింప చేసేందుకే మక్కాలో 'కాబా' పేరుతో నిర్మించిన ఇస్లామియా ఉద్యమ కేంద్రం సందర్శనే హజ్ లక్ష్యం. దైవ ఆరాధన చేసేందుకు, ఇస్లాం సందేశాన్ని తమ దేశాలకు తీసుకుపోయేందుకు ఏర్పాటు సమావేశానికి 'హజ్'అని పేరు పెట్టారు. ఈ మసీదు కాబా గృహం చుట్టూ ఉంది. ప్రపంచంలోని ముస్లీంలు అందరు కాబా వైపు తిరిగి నమాజు చేస్తారు. దీనినే ఖిబ్లా అంటారు. యావత్ ప్రపంచ ముస్లీం సమాజానికి ప్రధాన పుణ్యక్షేత్రమైన మక్కాలో జరిగే హజ్ ఆరాధనకు, ప్రపంచ వ్యాప్తంగా ముస్లీం సమాజం జరుపుకునే ఈదుల్ అజ్ హా (బక్రీద్0 పండుగకు అవినాభావ సంబంధం ఉంది. ఈ పండుగకు, హజ్, ఖుర్బానీలకు మూల కారణం హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం.. ఆర్థిక స్తోమత కలిగిన వారు హజ్ యాత్రకు వెళ్లగలిగితే, స్తోమత లేనివారు తమతమ ఇళ్ల వద్దనే పండుగ జరుపుకుంటారు..ఖుర్బానీలు ఇస్తారు. అందుకని పండుగ సంతోషాన్ని గుండెల్లో నింపుకుని, హద్దుల్ని అతిక్రమించకుండా పండుగ జరుపుకోవాలి. సాటివారి సంక్షేమం కోసం ఎంతో కొంత త్యాగం చేసే గుణాన్ని అలవరచుకోవాలి. ఈ విధమైన త్యాగభావాన్ని మానవుల్లో జనింపచేయడమే ఈదుల్ అజ్ హా(బక్రీద్) పర్వ దిన పరమార్థం....

## పత్తి పరిశ్రమ సంక్షోభం..!

(మొదటి పేజీ తరువాయి ) : ఇలా పరిశ్రమ యజమానులకు,రైతులకు కలిపి రూ.200ల కోట్ల దాక ఆర్థిక నష్టం వాటిల్లింది.

**అమ్మకానికి మూడు ఫ్యాక్టరీలు :** ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో మూడు ఫ్యాక్టరీలు అమ్మకానికి ఉంచినట్లు తెలుస్తుంది. కోట్లలో బకాయిలు పెండింగ్‌లో ఉండడం,కొనుగోలు చేసిన ధరకు సైతం అంతర్జాతీయ మార్కెట్ పలకకపోవడంతో వ్యాపారాలు దివాళా తీసారు. ఇటు కమిషన్ ఏజెంట్లకు సకాలంలో పేమెంట్ చేసుకోలేక అటే కోయంబత్తూరు నుండి పేమెంట్ రాబట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు బయ్యర్స్ డిసెంబరులోగా బోర్డు తిప్పేసి ఐపి కూడా పెట్టే యోచనలో ఉన్నారు.

**రియల్ ఎస్టేట్‌పై ప్రభావం :** పత్తి ధరలు కుంగిపోవడం పరోక్షంగా రియల్ ఎస్టేట్‌పై ప్రభావం చూపుతుంది. వ్యవసాయ మార్కెట్ మంచి లాభాల్లో నడిస్తేనే ఆదోనిలో రియల్ ఎస్టేట్ దందా జోరుగా సాగుతుంది. కానీ యార్డు నష్టాల్లో కొట్టుమిట్టాడంతో రియల్ఎస్టేట్‌తో పాటు అనుబంధ వ్యాపార రంగాలు కుదేలయ్యాయి.

**ప్రభుత్వం ఆదుకోవాలి :** గత ప్రభుత్వాలు పరిశ్రమ మనుగడకు చేయూత అందించిన విధంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యాపారులను ఆదుకోవాలని కోరుతున్నారు. గతంలో అనేక సబ్సీడీలతో పత్తి పరిశ్రమలను ఆదుకున్నాయని ప్రజెంట్ ప్రభుత్వం కూడా అర్హత గల ఫ్యాక్టరీలను గుర్తించి సబ్సీడీ అందించి ఆర్థికంగా గట్టెకించాలని అడుగుతున్నారు. గత ఏడు జూన్ వరకు ప్రెస్ అయిన బెళ్లతో పోలిస్తే ఈ ఏడు లక్షన్నర క్వింటాళ్ల వరకు తగ్గిపోవడం గమనార్హం.

## నవశకానికి నాంది విద్యావ్యవస్థలో మార్పులు

(మొదటి పేజీ తరువాయి ) : కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. అమ్మఒడి పథకంతో పాటు నాడు నేడు కింద కోట్ల రూపాయలతో ప్రతిపాఠశాలలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థుల జీవితాల్లో ముఖ్యమంత్రి వెలుగులు నింపుతున్నారని పేర్కొన్నారు. ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకుడదన్న సమున్నత లక్ష్యంతో తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదని ప్రభుత్వం ఈపథకం తెచ్చిందన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 27,773 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.36.10 కోట్లు, బనగానపల్లెలో 27,128 మందికి రూ.35.26 కోట్లు, డోన్‌లో 28,575 మందికి రూ.37.14 కోట్లు, నందికొట్కూరులో 25,565 మందికి రూ.33.22 కోట్లు, నంద్యాల్లో 26,580 మందికి రూ.34.55 కోట్లు, పాణ్యంలో 8536 మందికి రూ.11.09 కోట్లు, శ్రీశైలంలో 22,932 మందికి రూ.29.81 కోట్లు తల్లుల ఖాతాలో జమచేశారు. అందరి చేతుల మీదుగా విద్యార్థుల తల్లులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి లలితకుమారి, డిప్యూటి డిఇఓ మహమ్మద్ బేగ్, ఎంఇఓ బ్రహ్మం, శివరాం ప్రసాద్, సెక్టోరియల్ అధికారులు రఘురామిరెడ్డి, మనోహర్‌రెడ్డితో పాటు విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అకట్టుకున్నాయి.

## మహా సంకల్పానికి..దృఢ చిత్తానికి నిదర్శనం..తొలి ఏకాదశి..

(మొదటి పేజీ తరువాయి ) :

**ఇక పురాణాల్లోకి వెళ్లితే...:** మానవుల ఒక సంవత్సరకాలం దేవ కాలమాన ప్రకారంలో ఒకరోజుతో సమానం. ఈ మానవుల కాలంను సంవత్సరం, ఆయనం, రుతువు, మాసం, పక్షం, వారం, దినం, వ్యర్థం, గడియలు అని విభజించారు. వీటిలో ఆయనం యొక్క ప్రమాణం(కాలం) 6నెలలు. ఈ ఆయానంల్లో ఉత్తరాయనం, దక్షిణాయనంలు ఉంటాయి. దీనిగూర్చి క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే ...సూర్యుడు దక్షిణాన మకరరేఖ పైనుండి తూర్పు ఉత్తరాయన గల కర్కటరేఖ వైపు ప్రయాణం చేసే కాలాన్ని ఉత్తరాయణం అంటారు. అదేవిధంగా తూర్పు ఉత్తరాన ఉన్న కర్కటరేఖ నుండి తూర్పు దక్షిణాన గల మకరరేఖకు చేసే ప్రయాణాన్ని దక్షిణాయనం అంటారు. ఈ దక్షిణాయన ప్రారంభమాసమే ఆషాడమాసం. ఈ మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశినే తొలి ఏకాదశి అంటారు. ఈ ఏకాదశి నుండి 2022 జనవరి నెల 14వ తేది వరకు దక్షిణాయనంగా పరిగణిస్తారు. ఈ ఆరు నెలల కాలం దేవతలకు రాత్రితో సమానం. కనుక దేవతలు నిద్రకు ఉపక్రమిస్తారు. ఇలా దేవతలు నిద్రకు ఉపక్రమించే మొదటి రోజును "శయనైకాదశి" గా పండితులు అభివర్ణిస్తారు. 2022 జనవరి 14 (పుష్యమాసం) నుండి ఉత్తరాయణం ప్రారంభమవుతుందని జ్యోతిష్యులు తెలుపుతున్నారు. ఇకపోతే హిందూ శాస్త్రాలు ప్రకారం వైకుంఠ ద్వారాలు ఈ శయనైకాదశి తర్వాత మూసుకొని వైకుంఠ ఏకాదశిలో అంటే డిసెంబరు, జనవరి మాసాలలో వచ్చే శుక్లపక్ష ఏకాదశి నాడు తెరచుకుంటాయని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. వైకుంఠద్వారాలు మూసివేసివున్న కాలంలో జరిగిన కురుక్షేత్ర సంగ్రామం మనకు తెలిసిందే. ఈ కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడి చేతిలో భీష్మాచార్యులు నేలకూలింది ఈ దక్షిణాయనం కాలంలోనే. కావున ఈ కాలంలో వైకుంఠద్వారాలు మూసివుంటాయి కనుక ఉత్తరాయనం వచ్చే వరకు భీష్ముడు అంపశయ్యపైనే జీవించాడు. ఉత్తరాయణం మొదలైన మాసంలో తనువు చాలించాడని పురాణాలు తెలుపుతున్నాయి. అందుకే ఆ రోజును భీష్మేకాదశిగా కూడా పండితులు పరిగణిస్తున్నారు. అయితే ఆయన మాదిరి మనుషులు కొన ఊపిరితో ఉత్తరాయణం దాకా నిరీక్షిస్తుండడం అసాధ్యం. కనుక ఈ ఏకాదశి రోజున వైష్ణవ క్షేత్రాలలో ఉపవాసం చేసి నారాయణాన్ని దర్శనం చేసుకొంటే, దక్షిణాయనంలో చనిపోయినా మోక్షం లభిస్తుందని పండితులు ఉపదేశిస్తున్నారు. హిందువుల నమ్మకం కూడ ఇదే. ఈ నేపథ్యంలో ఎక్కడైతే విష్ణుదేవాలయాలు ఉన్నాయో అక్కడ సహస్ర నామార్చనలు, భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. అందుకే తొలి ఏకాదశి శుభాలను అందించే ఫలాలుగా చెప్పుకోవచ్చు.

**ఏకాదశి ప్రత్యేకత:** ప్రతి నెలలో రెండు ఏకాదశిలుంటాయి..ఏడాదికి ఇరవై నాలుగు..అధిక మాసం వచ్చిన సంవత్సరం మరో రెండు ఏకాదశులు అదనంగా వస్తాయి..ప్రతి ఏకాదశి ప్రత్యేకమైనదే..ఒక్కొదానికి ఒక్కోపేరు..అవి తొలిఏకాదశి.. వైకుంఠ ఏకాదశి.. భీష్మఏకాదశి.. ఉత్థాన ఏకాదశి ఇలా రకరకాల పేర్లు.. అయితే ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశి తొలి ఏకాదశికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు....ముఖ్యంగా మహావిష్ణువు అనుగ్రహం కోరుతూ ఈ రోజున ఉపవాస దీక్ష పాటిస్తారు.. అంతేకాక జాగరణ కూడా చేసే ఆచారం కూడా ఉంది..మరునాడు అంటే ద్వాదశి రోజున ఎవరికైనా భోజనం పెట్టి ఆ తరువాత దీక్షాపరులు తాము భోజనం చేసి వ్రతాన్ని విరమిస్తారు..అందుకే ఈ తొలి ఏకాదశి హిందువులకు ప్రత్యేకమైనదని చెప్పవచ్చు..

**పేలాల పిండి:** తొలి ఏకాదశి నాడు పేలాల పిండిని తప్పక తినాలని అంటారు.. పేలాల పితృదేవతలకు ఎంతో ఇష్టమైనవి.. అందువల్ల మనకు జన్మనిచ్చిన పూర్వీకులను ఈ రోజు గుర్తు చేసుకోవడం మన బాధ్యత.. అలాగే ఆరోగ్యపరంగా బయట ఉష్ణోగ్రతలకు అనుగుణంగా శరీరం అనేక మార్పులకు లోనవుతుంది.. అందువల్ల ఈ రోజున దేవాలయాల్లోనూ, ఇళ్ల వద్దా పేలాల పిండిని ప్రసాదంగా పంచుతారు..

## ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలి

**ఆదోని రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష ,కార్యదర్శులు భరత్‌కుమార్,శ్రీనివాసులు,గర్ల్స్ కన్వీనర్ సంయుక్తలు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించలేమని విద్యార్థులు పాఠ్యపుస్తకాలు కొనుక్కోవాలని ఇంటర్ విద్యాశాఖ ఆదేశించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్,నాగరాజు, పవన్,రాజు,శాంతి,రాధిక తదితరులు పాల్గొన్నారు.

## మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు

**నంద్యాల క్రైం, జూన్ 28, ప్రభాతవార్త:** మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ఏవరైనా మద్యం తాగి వాహనాలు నడిపినా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా శాంతిభద్రతల విషయంలో అటంకం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లా ఎస్పీకార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మూడవ పట్టణ పోలీసులు గస్తీ తిరుగుతుండగా పబ్లిక్ రోడ్డులోనే మద్యం సేవించి మహిళలకు సైగలు చేస్తు ఈళలు వేస్తు అసభ్య పదజాలంతో దూషిస్తున్న లక్కబోయిన శ్రీనివాసులు, కొండయ్య పామూరు మండలం ప్రకాశం జిల్లా అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు నందికోట్కూరు మండలంలో నివాసం ఉంటున్నారు. బుధవారం కోర్టులో హాజరుపరచగా సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేజ్ ఆర్ రాంభూపాల్‌రెడ్డి 15 రోజులు జైలుశిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. సభ్యసమాజంలో మహిళలను గౌరవించడం అందరి బాధ్యత అని తెలిపారు.

## త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

– ముస్లిం సోదరులు,వారి కుటుంబ సభ్యులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి గుమ్మనూరు జయరాం

**ఆలూరు, జూన్ 28, ప్రభాతవార్త:** ఇస్లాం క్యాలెండర్ ప్రకారం ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఉన్న ముస్లిం సోదరులు,వారి కుటుంబ సభ్యులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల ఆరాధ్య గ్రంథం దివ్య ఖురాన్ ప్రకారం సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతల నుంచి మానవాళిని జాగృత పరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ పంపిన ప్రవక్తలో ఒకరైన అజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పండుగే బక్రీద్ పండుగ అన్నారు. ముస్లిం సోదరులు వారి కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకోవాలని మంత్రి గుమ్మనూరు జయరాం ఆకాంక్షించారు.

## పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే శ్రీదేవమ్మ

**పత్తికొండ, జూన్ 28, ప్రభాతవార్త** పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని సచివాలయం-4లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొన్నారు. పట్టణంలోని కుమ్మరివీధి, కళ్లు పెంటవీధి,కటిక వీధిలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అవ్వ,తాతలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రావోయే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. కళ్లు పెంటవీధికి చెందిన షేక్ హుస్సేన్ భాను జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కుటుంబం చాలాబాగు పడిందని మళ్లీ జగనన్న సిఎం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయణదాసు,మాజీ ఎంపిపి నాగరత్నమ్మ,ఎంపిపి,జిల్లా నాయకులు,సర్పంచ్‌లు,వార్డుమెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందరికీ అందించాలి

-వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి

**సు ంకేశ్వరి(మంత్రాలయం), జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకంలో భాగంగా అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని వైసిపి మండల కన్వీనర్ గుర్రెడ్డి భీంరెడ్డి అన్నారు.బుధవారం ఎంఎల ఏ వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని సుంకేశ్వరి,మాలపల్లి,చెట్నహళ్ళి గ్రామాల్లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు మండల అధికారులు అందరూ పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఇంఛార్జ విశ్వనాథ్‌రెడ్డి,సచివాలయ కన్వీనర్ రాఘవేంద్రాచారి.లక్ష్మిరెడ్డి,సర్పంచ్‌లు ముక్కరన్న,అంజినప్ప,ఉప సర్పంచ్ వీరనాగప్ప,రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల అభివృద్ధి కారకులు మాజీ పిఎం పివినే కారణం

-పివి నరసింహారావు 102వ జయంతి వేడుకలు ఘనంగా

**నంద్యాల హాస్పటల్, జూన్ 28, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా ప్రస్తుతం అభివృద్ధి చెందిందటే దానికి మొదటి కారణం మాజీ ప్రధాని స్వర్గీయ పివి నరసింహారావు అని అయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు దేశాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేసిన గొప్ప వ్యక్తి అని పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.చింతల మోహన్‌రావు నంద్యాలపట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దాసరి చింతలయ్య కోశాధికారి ఎస్‌వైడి ప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఉకోట్టు వాసులు పేర్కొన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పివి నరసింహారావు 102వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భరతమాత ముద్దుబిడ్డ తొలి తెలుగు ప్రధానికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఎపీలో ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో భూ సంస్కరణల చట్టం తీసుకువచ్చి పేదలకు న్యాయం చేశారని పేర్కొన్నారు. పెత్తందార్లు అడవుల్లో వన్యమృగాలను చంపడంతో చలిలించిపోయిన పివి వాటి సంరక్షణకు వన్యప్రాణ సంరక్షణ చట్టాన్ని తీసుకువచ్చిన ఘనత ఆయనదే అన్నారు ప్రధానిగా నంద్యాల జిల్లాకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత పివికే దక్కుతుందని దేశ ఆర్థికసంస్కరణల పితామహుడిగా పేర్కొన్నారు. నంద్యాల్లో రైల్వేను మీటర్ గేజ్‌ను బ్రాడ్‌గేజ్‌గా మార్చడం, మహానంది అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటు, నేషనల్ సీడ్స్‌కార్పొరేషన్ ఏర్పాటు, నూనెపల్లె ఫ్లైఓవర్ నిర్మించడంతో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సమావేశంలో కిసాన్ సెల్ అధ్యక్షులు శివారెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి పార్టీ గుణాత్మక విమర్శలను స్వాగతీస్తుంది

-స్వాతీచౌదరికి, పార్టీకి ఎలాంటి సంబంధం లేదు

-నారా లోకేష్‌తో అ క్రమ సంబంధాలు పూర్తిగా అవాస్తవం

**నంద్యాల, జూన్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** టిడిపి పార్టీ యువ నాయకుడు, పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌పై వస్తున్న అక్రమ సంబంధం ఉందన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఖండిస్తు టిడిపి పార్టీ శ్రేణులు ఎలాంటి అందోళన చెందాల్సిన అవసరం లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో జిల్లాలోని టిడిపి శ్రేణులకు పంపారు. వివరాలు మేరకు విదేశాల్లో ఉంటూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా చెప్పుకుంటున్న స్వాతీరెడ్డి అలియాస్ స్వాతీచౌదరికి టిడిపి పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆమె సోషల్ మీడియా వేదికగా పరుష పదజాలం వాడుతూ ఫోటోలు మార్ఫింగ్ చేస్తు, ప్రతిపక్ష, పాలకపక్ష కుటుంబ సభ్యులపై వ్యక్తిగత దుషణలకు దిగుతూ టిడిపి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నది. ఇది పార్టీ నియమ నిబంధనలకు పూర్తిగా విరుద్ధం తెలుగుదేశం పార్టీ గుణాత్మక విమర్శలను స్వాగతీస్తుంది తప్పా దిగజారీ విమర్శలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహిందన్నారు. అలాగే స్వాతీ చౌదరికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు మధ్య అక్రమ సంబంధం ఉందన్న వస్తున్న వార్తలు పూర్తిగ అవాస్తవమని ప్రకటనలో వివరించారు.

## పిఎస్‌హెచ్‌ఎంల సబ్జెక్టు కన్వర్షన్ ఇవ్వాలి

**నంద్యాల విద్య, జూన్ 28, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టిన సందర్భంలో పిఎస్‌హెచ్‌ఎంలకు అయా సబ్జెక్టులో కన్వర్షన్లకు అవకాశం ఇవా ్వలని ఎస్టీయు రాష్ట్ర సహాధ్యక్షులు సోమేసుల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్టీయు భవన్‌లో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులైన అజామ్‌బేగ్, మౌలాలి అధ్యక్షతన రాష్ట్రఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, లగిశెట్టి సుబ్బయ్యలు మాట్లాడారు. పదవి వీరమణ వయస్సుకు దగ్గరలో ఉన్న పిఎస్‌హెచ్‌ఎంలకు ఆరోగ్యసమస్యల దృష్ట్యా మరోసారి సబ్జెక్టు కన్వర్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎస్‌హెచ్‌ఎంలను అదే మండలంలో విద్యార్థుల సఖ్య అరోహణ క్రమంలో కొనసాగిస్తామని తెలిపిప్రభుత్వం మాట తప్పి వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం చాల దారుణమన్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే స్పందించి పదోన్నతుల కంటే ముందే కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దేవేంద్రారెడి , సుబ్బయ్య, నాగేంద్రకుమార్,ప్రసాద్, బాలసుబ్బయ్య, నాగేశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వన్‌టౌన్ ఎస్ఐగా పుల్లయ్య బాధ్యతలు

**నంద్యాల క్రైం, జూన్ 28, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలోని వన్‌టౌన్‌పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా జిసి పుల్లయ్య బుధవారం విధుల్లో చేరారు. ఉన్నతాధికారుల అదేశాల మేరకు విధుల్లో చేరిన పుల్లయ్య గతంలో కర్నూలు సిఐడి కారా ్యలయంలో పనిచేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవయే పరమావధిగా పనిచేస్తానని పుల్లయ్య పేర్కొన్నారు. వన్‌టౌన్ స్టేషన్‌లో విధులు చేపట్టిన పుల్లయ్యను పలువురు సిబ్బంది అభినందించారు. గతంలో పట్టణంలో వివిధ పోస్టుల్లో పనిచేసిన సందర్భాలున్నాయి.

## ఉచిత మినరల్ వాటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా

-త్వరలో భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పిస్తాం

**మహానంది, జూన్ 28, ప్రభాతవార్త:** ప్రముఖ శైవక్షేత్రమైన మహానంది క్షేత్రంలో దివీస్ ల్యాబొరేటరీస్ వారి ఆధ్వర్యంలో రూ.48 లక్షల వ్యయంతో నిర్మించిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించుకొని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానంది క్షేత్రం ఇటీవల కాలంలో మంచి అభివృద్ధి చెందుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం దివీస్‌ల్యాబొరేటరీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మహానంది క్షేత్రానికి మూడు ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌లను నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం నిర్మాణానికి సహకరించిన దాతలను సన్మానించారు. త్వరలోనే మహానందీశ్వరుని నిజరూప దర్శనభాగ్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇఓ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమ్మా మహేశ్వర్‌రెడ్డి, శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, పుల్లయ్య యాదవ్, మండల నాయకులు, ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

**చాగలమర్రి, జూన్28, ప్రభాతవార్త:** మండలంలోని చెంచుగూడెం ప్రాథమిక పాఠశాలలో గత ఎనిమిది సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దిన వెంకటేశ్వర్లు బదిలీ పై వెలుతుండడంతో గ్రామస్తులు,విద్యార్థులు ఘనసన్మానం చేశారు.చెంచు విద్యార్థులను విద్యాబోధనలో తీర్చిదిద్దడంతో ఆయన కీలకపాత్ర పోషించి అంకితభావంతో పనిచేశారని ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు.ఇంత మంచి ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌తోపాటు విద్యార్థులు,గ్రామస్తులు ఉపాధ్యాయుడిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జాకీర్,ఎస్ఎంసీ చైర్మన్ మురళి పాల్గొన్నారు.

## టైరు పేలి కారు బోల్తా

- వ్యక్తికి స్వల్ప గాయాలు

**చాగలమర్రి, జూన్28, ప్రభాతవార్త:** మండలంలోని పెద్దబోధనం గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారి పై టైర్ పేలి కారు బోల్తాపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది.స్థానికుల వివరాల మేరకు హైదరాబాద్ నుండి కారులో మస్తాన్ కుటుంబీకులతో స్వగ్రామమైన రాజంపేటకు బక్రీద్ పండుగలో పాల్గొనేందుకు బయలుదేరారు.పెద్దబోధనం గ్రామ సమీపంలోని కాశినాయన ఆశ్రమం సమీపానికి చేరుకోగానే కారు ముందు టైర్ పేలి బోల్తా పడింది.బోల్తాపడ్డ కారు నుజ్జు నుజ్జు అయింది.కారులోని మస్తాన్‌కు స్వల్ప గాయాలు కాగా మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## కుష్ఠు వ్యాధి నివారణకై ఇంటింటి సర్వే

**అవుకు, జూన్28, ప్రభాతవార్త:**

అవుకు మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొండమనాయునిపల్లె,కునుకుంట్ల,గుండ్లశింగవరం,అవుకు మరియు మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ వైద్యాధికారులు వినోద్ కుమార్,యమునాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం గురించి హెల్త్ సూపర్‌వైజర్ కమల్ సాహెబ్ మరియు వేణుగోపాల్‌రాజు ప్రతి ఇంటి వద్దకు స్వచ్ఛంద ఆరోగ్య కార్యకర్తలు మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సర్వే చేశారన్నారు. ఎవరికైనా చర్మం పై స్పర్శలేని రాగి రంగులో మచ్చలు ఉండి మరియు చర్మం పొడిగా ఉండటం,కనుబొమ్మలు మరియు కనురెప్పలు వెంట్రుకలు రాలిపోవడం,చేతుల నుండి వస్తువులు జారిపోవడం,కాళ్ల నుండి చెప్పులు జారిపోవడం,కాళ్లు మరియు చేతులు తిమ్మిర్లు లేదా జోము పట్టడం మునుపు అనువు అనుభవించే లక్షణాలు ఉంటేవారిని గుర్తించి వ్యాధినివారణ చేయించుకోవాలని ఆ తరువాత వ్యాధి అధికారి కుష్ఠు వ్యాధి నివారణ చేసిన తర్వాత ప్రభుత్వం ఉచితంగా ఎండీటీ మందులు వాడడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని వ్యాధి నివారణ మరియు మందులు వాడడం ఆలస్యమైతే శాశ్వతంగా అంగవైకల్యం ఏర్పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జోత్స్న,చంద్రకళ,సునీత,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లావణ్య,ప్రమీలాబాయి,శ్రీలేఖ,ఆశాకార్యకర్తలు మరియు స్వచ్ఛంద వలంటీర్లు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

**హొళగుంద, జూన్ 28, ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన హొళగుందలో స్థానిక బస్టాండ్ వద్దనున్న కన్నడ స్కూల్లో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ బళ్లారి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నేడు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు గురువారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కంటి వైద్య నిపుణులతో కంటి పరీక్షలు చేయబడునని అవసరమైన కంటిఅద్దాలు మరియు ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు.

## రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి

**హాలహర్వి, జూన్ 28, ప్రభాతవార్త :**

ఫర్టిలైజర్ షాపులో ఎరువులు,పురుగుల మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని ఏఓ శివశంకర్ అన్నారు. బుధవారం చింతకుంట గ్రామంలో ఫర్టిలైజర్ షాపులో ఎరువులు,పురుగుల మందులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు,పురుగుల మందులను విక్రయించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎరువులు కొనుగోలు చేసే రైతుల నుంచి ఆధార్ కార్డు నంబర్ ఈ-యాప్‌లో నమోదు చేసుకుని వేలి ముద్రలు తీసుకున్న తర్వాత ఎరువులు ఇవ్వాలని సూచించారు. అంతేకాకుండ నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఫర్టిలైజర్ యజమానులు ప్రతి ఏటా లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని ఆదేశించారు. అనుమతి లేకుండ ఫర్టిలైజర్ షాపులు నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం చింతకుంట సొసైటీ బ్యాంకును పరిశీలించారు. కౌలు రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకు సిఈఓ బాలరాజును కోరారు. చింతకుంట గ్రామంలో 130మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్లు వున్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**దేవనకొండ, జూన్ 28, ప్రభాతవార్త :** ఉపాధి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) జిల్లా అధ్యక్షులు వీరశేఖర్,సిఐటియు మండల కార్యదర్శి అశోక్‌లు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని కరివేముల సచివాలయం ముందు వ్యకాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రాముడు అధ్యక్షతన ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 6నుండి 8వారాల ఉపాధి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని రెండు నెలలుగా ఉపాధి వేతనాలు ఇవ్వకుంటే ఎలా పని చేయాలని వెంటనే ఉపాధి పెండింగ్ బిల్లులు కూలీల ఖాతాలో జమచేయాలన్నారు. పేదలపై ఆర్భాటంగా ప్రేమను కురిపిస్తున్న ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం పేదలను, కూలీలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కష్టం చేసిన పనికి కూలీలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం దేనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు ఇవ్వాలని అలాగే 200రోజులు పనిదినాలు,రూ.600లు వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మన్న,మోహన్,రంగమ్మ,ఈరన్న,రామకృష్ణ,దాస్,పోగన్న తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలి

– రైతుసంఘం నాయకులు నారాయణస్వామి

**ఆలూరు, జూన్ 28, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రోడ్డు రవాణ,రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన, నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతన్నలు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు నారాయణస్వామి,మండల కార్యదర్శి అగ్రహారం ఈరన్నలు అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక జ్యోతిబసు భవన్‌లో రైతు సమస్యలు పరిష్కరించాలని,ఈ నెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికలను విడుదల చేశారు. ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు వీరేష్,నాగరాజు,పరమేష్‌గౌడ్,ఎం వీరేష్,శేకన్న,నరసన్న పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించిన గ్రామస్తులు

**ఆదోని రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దహరివాణం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కోరారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో గడప గడపకు తిరుగుతూ గ్రామప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నీటి సమస్య ఉందని తెలపడంతో గ్రామంలో నీటి సమస్య లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే సాయి ఆదేశించారు. గ్రామంలో ఏవైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గీతావాణి,తహశీల్దార్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల రుణాలు మాఫీ చేయాలి

**పత్తికొండ, జూన్ 28, ప్రభాతవార్త :**

పంట పెట్టుబడి కింద రైతులు తీసుకున్న అన్ని రకాల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని ఏపి రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు కారన్న,పెద్దఈరన్నలు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని హోసూరు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి అన్నవస్త్రాలను అందించే అన్నదాత రైతుల ఆత్మహత్యలను నివారించాలని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు పంట పెట్టుబడి కింద ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలని,90శాతం సబ్సీడీతో విత్తనాలు, ఎరువులు,పురుగుల మందులు,వ్యవసాయ ఉపకరణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికై ఏపి రైతుసంఘం చేపట్టబోయే ఉద్యమాలలో రైతులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# ఇంకా పరిష్కరించని భూ రీసర్వే అర్జీలు

**పెద్దకడుబూరు, జూన్ 28, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పెద్దకడుబూరులో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు భూ రీసర్వే పనులు ఇంకా పరిష్కరించలేదు. వివరాల్లోకి వెళితే మండలంలో సుమారుగా రైతులకు జగనన్న భూసర్వే పాస్ పుస్తకం నెలరోజులు అవుతున్నా కూడా పరిష్కరించలేదు. అయితే ప్రభుత్వం మండలానికి ఒకరు డిప్యూటీ భూ రీసర్వే తహశీల్దార్‌గా నియమించి నెలరోజుల వుతున్నా కూడా పెద్దకడుబూరు మండల తహశీల్దార్ పరిష్కరించలేదు. అయితే పెద్దకడుబూరు తహశీల్దార్ కార్యాలయంలో ప్రజలకు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలకు రోజురోజుకు అయోమయం కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు. ప్రతిరోజు పెద్దకడుబూరు మండలానికి వివిధ గ్రామాల నుంచి రైతులు ఉదయం 10గంటలకే తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంటారు. సిబ్బంది కూడా సమయానికి వస్తున్నారని రైతులు వివిధ గ్రామాల నుంచి వస్తున్నారు కానీ తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది మాత్రం సరైన సమయానికి రావడం లేదు. అయితే సుమారుగా రెండు నెలలు అయ్యింది జగనన్న భూ సర్వే పాస్ పుస్తకాలు అందచేసి అలాగే ఉన్నతాధికారులు మీకు ఏవైన సవరణలు ఉంటే తహశీల్దార్ కార్యాలయంలో అర్జీలు పెట్టుకోమని చెప్పడం జరిగింది. అయితే ఇప్పటికే 515అర్జీలు భూ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మహేష్‌కు ఇవ్వడం జరిగింది. అయితే ఆయన నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తూ కార్యాలయానికి 11గంటలకుపైన వస్తాడు వచ్చిన తర్వాత కూడా ఈ పెండింగ్ అర్జీలు పూర్తి చేయాలనే అవగాహన లేకుండ అధికార పార్టీ నాయకులు చెప్పిన పనిచేస్తూ ఉన్నాడని రైతులు వాపోతున్నారు. కిందిస్థాయి అధికారుల మీదు ఎలా పడితే అలా మాట్లాడుతున్నాడని కిందిస్థాయి అధికారులు కొంతమంది బయట గుసగుసలాడుకుంటున్నారు. అయితే డిప్యూటీ తహశీల్దార్ మహేష్‌ను కలవాలని రైతులు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఆయన మాత్రం రైతుల మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. అయితే పెద్దకడుబూరు మండలానికి తహశీల్దార్ ఉన్నాడు కదా..ఆయనకు విన్నవించుకోవచ్చు కదా..అని వివిధ గ్రామాల ప్రజలు పెద్దకడుబూరు మండలంలో ఉన్న ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే మండల తహశీల్దార్ ఏ సమయానికి వస్తాడో తెలియని పరిస్థితి ప్రజలకు తెలియడం లేదు. ఆయన కూడా ఉదయం 11గంటలపైనే వస్తాడు వచ్చిన తర్వాత అరగంట సేపు టిఫిన్ చేయడానికి,15ని॥లు టీ తాగడానికి సమయం తీసుకుంటాడని తర్వాత ఎవరైతే వచ్చిన అధికారులందరు ఆయనకు గులాం చేయాలని గులాం చేసేంతవరకు సుమారు 12.30గంటలు పైన అవుతుంది. అప్పుడైనా కూడా రైతుల సమస్యలు తెలుసుకోవాలనే ఆలోచన లేకుండ ఆయన ఫోన్ చూస్తూనే ఉంటాడని రైతులు గుసగుసలాడుతున్నారు. అయితే కొంతమంది ప్రజలు ఎలాగైనా కూడా తహశీల్దార్‌ను కలవాలని చూస్తే బయట ఉన్న క్లర్క్ సిబ్బంది రైతులను అడ్డగిస్తున్నారు. ఏమి మేము లోపలికి వెళ్లకూడదా అని అక్కడ ఉన్న సిబ్బందిని ప్రశ్నిస్తే సారు రెడ్డి వాళ్లతోనే బిజీగా ఉన్నాడు..ఫోన్ మాట్లాడుతూ బిజీగా ఉన్నాడు..సార్ తింటున్నాడు..అని నోటికి ఏది వస్తే ఆ ప్రశ్నలు రైతుల ముందు మాట్లాడుతున్నారు. ఏదేమైనప్పటికీ మండలంలో సుమారుగా రెండు నెలలు అయినా కూడా భూరీసర్వే పెండింగ్ అర్జీలు ఒక్కటి కూడా పరిష్కరించని భూ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మహేష్ కూడా పరిష్కరించకుండ ఉన్నారు. అయితే ఆయన నేను చెప్పిన విధంగా మండల కార్యాలయం నడుచుకోవాలని కిందిస్థాయి అధికారులు తనను ప్రశ్నించకూడదని ఒకవేళ ప్రశ్నిస్తే ఆ కిందిస్థాయి అధికారులను మనసులో పెట్టుకుని వారు చేయలేని పనులు కూడా వారితో చేయిస్తాడని కిందిస్థాయి అధికారులు మొరపెట్టుకుంటున్నారు. ఈయన ఎప్పుడు కార్యాలయం నుంచి బయటికి వెళ్తాడో అప్పుడు కార్యాలయం అభివృద్ధి అవుతుందని కిందిస్థాయి అధికారులు ఎవరికి వారే గుసగుసలాడుతున్నారు. ఏదేమైనప్పటికీ రైతన్న పొలాల్లో చినుకు పడే సమయంలో ఆ గట్టున ఈ గట్టున జగనన్న రాళ్లు పాతితే అవి ఇరువురి మద్య ఘర్షణ జరుగుతున్నా కూడా తహశీల్దార్ కార్యాలయంలో ఏమీ ఎరగనట్లుగా ఉన్నారు. కానీ రైతులు పొలాల్లో తలలు పగలు కొట్టుకుని పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ నరకయాతన పడుతున్న ప్రజలు చాలామంది వున్నారు. అయితే ఈ భూ రీసర్వే పెండింగ్ అర్జీలు ఎప్పటికీ పూర్తి అవుతాయో అంతుచిక్కని రైతన్నలు ఆలోచనలో ఉన్నారు. ఏదేమైనప్పటికీ జిల్లాలో పెద్దకడుబూరు మండలంను ఉన్నతాధికారులు దృష్టి సారించి వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే విత్తనం వేసుకునే సమయానికైనా ఈ భూ రీసర్వే పెండింగ్ అర్జీలు పరిష్కరించాలని ఉన్నతాధికారులకు రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కుల,మతాలకు అతీతంగా పథకాలు : మంత్రి జయరాం



**ఆస్పరి, జూన్ 28, ప్రభాతవార్త :** కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం మండల పరిధిలోని జొహరాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ నెల్లూరప్ప ఆద్వర్యంలో గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం,తాగునీటి సంపును మంత్రి గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామంలో జరిగిన అభివృద్ది కార్యక్రమాలు,ప్రారంభోత్స వాల్లో మంత్రి జయరాం మమేకమయ్యారు. కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని తాగునీటి సంపును మంత్రి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ రూ.40లక్షలు మరియు తాగునీటి సంపు రూ.23లక్షలతో తాగునీటి ఎద్దడి నివారణకు దోహదపడిందన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయం అంటే ప్రజలకు సేవ చేసే ఆలయం లాంటిదన్నారు. సమస్యతో వస్తున్న ప్రతి ఒక్క వ్యక్తిని చిరునవ్వుతో ఆహ్వానించి వారి యొక్క సమస్యలను విని పరిష్కరించాలన్నారు. అనంతరం మంత్రి జయరాం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని దర్శించి ప్రభుత్వం ఆ కుటుంబానికి గత మూడేళ్లుగా చేస్తున్న మంచిని వివరించారు. అలాగే వారి కుటుంబంలో సమస్యను తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటిస్తుండగా ఎస్‌సి కాలనీలో తాగునీటి సమస్య ఉందని మంత్రి దృష్టికి తీసుకురాగా మంత్రి ఇందుకు సానుకూలంగా స్పందించి రూ.10లక్షలు ఎస్‌సి కాలనీకి తాగునీటి సదుపాయం కొరకు మరియు రూ.10లక్షలతో బిసి కాలనీలో మౌలిక సదుపాయాలు,తాగునీటి పనుల కోసం నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి,ఆస్పరి తహశీల్దార్ కుమారస్వామి, ఎంపిడిఓ రాణెమ్మ,జొహరాపురం ఎంపిటిసి శ్రీరాములు,జడ్‌పిటిసి దొరబాబు,సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన్,మాజీ మండల కన్వీనర్ సుంకర రామాంజనేయులు,జిల్లా కెడిసిసి డైరెక్టర్ ములింటి రాఘవేంద్ర,మండల కన్వీనర్ పెద్దయ్య,సొసైటీ సిఈఓ అశోక్,మండల జెసిఎస్ మండల కన్వీనర్ బసవరాజు,కేశవరెడ్డి,ఆలూరు మాజీ జడ్‌పిటిసి రామ్‌భీమ్ నాయుడు,శివకోటి, జెడి రంగస్వామి,ఎంపిటిసి రాధాకృష్ణ,తేవుల ప్రకాష్‌నాయుడు,విజయ్‌కుమార్, పెద్దిరెడ్డి,శివ,లక్ష్మన్న,శ్రీరాములు,గఫూర్,ప్రకాష్,మేఘనాథ్,రంగన్న,గోవిందు,మల్లేష్,ఆంజనేయులు,అలిపిరా,నాగరాజు,రామస్వామి,చౌదరి,నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగురవేస్తాం



**ప్యాపిలి జూన్28(ప్రభాతవార్త):** డోన్ నియోజకవర్గంలో టిడిపిని గెలిపించి టిడిపి జెండాను ఎగురవేస్తామని మండల టిడిపి ఇన్‌చార్జ్ దర్మారం పెద్దనాగిరెడ్డి, టిడిపి నాయకులు గడ్డం అంకిరెడ్డిలు అన్నారు. పట్టణంలోని కిందిగేరి లో బుధవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్బం గా వారు మాట్లాడుతూ గ్రామాల లో, పట్టణాలలో సమస్యలు లేకుండ చేస్తామని చెప్పిన వైకాపా ప్రభుత్వం పథకాల అమలులో జిమి మ్మక్కులు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నదని ద్వజమెత్తారు. కాలనీలలో సిసిరోడ్డు, డ్రైనేజి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వైకాపా ప్రభుత్వహయంలో కరెంటు, బస్సు చార్జీలను పలుమార్లు అధికంగా పెంచడం వల్ల పేద, మద్యతరగతి ప్రజలపై ఆర్థికభారాన్ని మోపుతున్నదని ద్వజమెత్తారు. రానున్న ఎన్నికలలో నియోజకవర్గంలోనే ప్యాపిలి మండలం నుండి టిడిపికి అత్యధిక మెజారిటిని ప్రజలు అందించాలని కోరారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దశల వారీగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. వింత నిబంధనలు, అంక్షలతో ప్రభుత్వ పథకాలలో కోతను విధిస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికలలో వైకాపా బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని టిడిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గోల్ల రామ్మోహన్, మెట్టుపల్లె సుదర్శన్, చిన్నసుంకయ్య, గండికోట పెద్ద రామాంజనేయులు, ఖాజాపీరా, ఎస్.కె.వలి, కొంగనపల్లి మధు, లక్ష్మి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా టిడిపి బస్సుయాత్ర



**కర్నూలు న్యూసిటి, జూన్ 28, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అదేశాల మేరకు అనంతపురం పార్లమెంటు జిల్లా అధ్యక్షులు రాయదుర్గం నియోజకవర్గం పార్టీ ఇంచార్జీ శ్రీ కాల్వ శ్రీనివాసులు అధ్వర్యంలో అనంతపురం జిల్లాలో రెండవ రోజు రాయదుర్గం నియోజకవర్గంలో బస్సుయాత్ర నిర్వహించడం జరిగింది. ఈబస్సుయాత్ర కార్యక్రమంలో కర్నూలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆధోని నియోజకవర్గ పార్టీ ఇంచార్జీ కె మీనాక్షినాయుడు, ఆలూరు నియోజకవర్గం టిడిపి పార్టీ ఇంచార్జీ కోట్ల సుజాతమ్మ, ఎమ్మెల్సీ బిటి నాయుడు, హిందుపురం పార్లమెంటు పార్టీ అధ్యక్షులు బి కె పార్థసారథిలతో కలిసి పాల్గొన్నారు.

## రెడ్డి కమిటీ డెవలెప్‌మెంట్ సొసైటి అసెంబ్లీ కన్వీనర్‌గా... ఇమడకంటి



**నంద్యాల క్రైం, జూన్ 28, ప్రభాతవార్త :** రెడ్డికమిటీ డెవలప్‌మెంట్ సొసైటి నంద్యాల నియోజకవర్గ కన్వీనర్‌గా ఇమడకంటి జయభారత్‌రెడ్డిని నియమించింది. బుధవారం నియామకపత్రాన్ని అందించడం జరిగిందని రెడ్డి కమిటీ డెవలప్‌మెంట్ సొసైటి రాష్ట్ర అధ్యక్షులు ఎర్రపురెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డా.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కన్వీనర్‌గా నియమింపబడ్డ జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డిజాతి కులాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తానని తెలిపారు. రెడ్డి కులాల్లో కూడ ఆర్థికంగా చితికిన వారు ఉన్నారని అలాంటి వారిని మరింత బలోపేతం చేసేందుకు శాయశక్తుల కృషిచేస్తానన్నారు. రెడ్డి కమిటీ డెవలప్‌మెంట్ సొసైటిలో అందరిని కలుపుకొని ఇతర రెడ్డి సంఘాల సమన్వయంతో ముందుకు వెళ్తామని తెలిపారు. రెడ్డి జాతి ఐక్యత, అభివృద్ది కోసం అన్ని విధాల చేయూత అందిస్తు సమస్యలపరిష్కారం కోసం కృషిచేస్తానని జయభారత్‌రెడ్డి తెలిపారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికకు ధరఖాస్తులు అహ్వానం : డిఇఓ



**నంద్యాల విద్య, జూన్ 28, ప్రభాతవార్త:** జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాకమిషనరు సురేష్‌కుమార్ ఇచ్చిన అదేశాల మేరకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల అవార్డులు 2023 ఎంపిక మేరకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ధరఖాస్తుచేయబోవు ఉపాధ్యాయులు నేషనల్ అవార్డ్సు టీచర్స్.జిఓవి.ఐఎన్ వెబ్‌సైట్ నందు పూర్తి వివరాలతో ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన మేర్కొన్నారు. నేటి నుంచి జులై 15 లోపల అన్‌లైన్‌లో ధరఖాస్తుల స్వీకరణ జులై 16 నుంచి 25 వరకు రీజినల్ సెలెక్షన్ కమిటీకి ధరఖాస్తులను ఫార్వర్డుచేయడం జరుగుతుందన్నారు. జులై నెల మధ్యకాలంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి కార్యాలయానికి పంపబడుతుంది. జులై 26 నుంచి ఆగష్టు 3వ తేది ప్రభుత్వం నియమించబడిన సెలెక్షన్ కమిటీ పరిశీలిస్తుంది. ఆగష్టు నెలలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు కలిపి 154 మందికి అవార్డులను ప్రకటిస్తుంది. జులై 7 నుంచి ఆగష్టు 14 మధ్య వెరిఫికేషన్ కమిటీ ద్వారా తుదినిర్ణయం తీసుకోబడుతుం ది. ఎన్నికైన ఉపాధ్యాయులకు ఆగష్టు 16 నుంచి 18 వరకు కేంద్ర విద్యాశాఖమంత్రి అమోదంతో అవార్డు లకు ఎంపికైన ఉపాధ్యాయులకు సమాచారం అందించబడుతుంది. ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబర్ 5న దేశంలో ఎన్నికైన ఉపాధ్యాయులందరికి సన్మాన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

**10వ, ఇంటర్ ఓపెన్‌స్కూల్ పరీక్షలు ప్రశాంతం:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడుతున్న సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్‌స్కూల్ పదవతరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లమధ్యనిర్వహించామని డిఇఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పదవ తరగతి పరీక్షలు మూడు పరీక్షా కేంద్రాల్లో 210 విద్యార్థులకు గాను 182 మంది హాజరయ్యారు. ఇంటర్ మూడు పరీక్షాకేంద్రాల్లో 119 మంది విద్యార్థులకు గాను 91 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 6 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు 6 పరక్షా కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేశారు.

## జూలై నెలాఖరు వరుకు ఉపాధి పనులు కల్పించండి



**ఉయ్యాలవాడ, జూన్ 28, ప్రభాతవార్త:** ఉయ్యాలవాడ మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలోని ఫిల్డ్ అసిస్టెంటు టెక్నికల్ అసిస్టెంట్‌లతో ఏపిడి సాంబ శివరావు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని అలాగే ఉపాధి కూలీలకు కనీసం వేతం రూ.250లు వచ్చేవిధంగా చూడాలన్నారు. పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఓ రవిప్రకాష్, ఇంచార్జ్ ఇసి షరీప్, టెక్నికల్ అసిస్టెంటులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వేతనాలు అందించడంలో ప్రభుత్వం విఫలం



**పత్తికొండ, జూన్ 28, ప్రభాతవార్త :** మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింది ఉపాధి పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు వేతనాలు అందించడంలో ప్రభుత్వం,అధికారులు పూర్తిగా విఫలం చెందారని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు సరిగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పనులు చేసి 5వారాలు గడిచినా ఇంతవరకు వేతనాలు జమకాలేదని దీంతో కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలు రాకుండ తాము ఏమి తిని బ్రతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు పనులు కల్పించి వేతనాలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుందని అయితే కింది స్థాయి అధికారులు ఉపాధి కూలీలకు వేతనాలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైన తాము చేసిన పనులను కూలీలు ఇవ్వాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

## మా భూమి మాకు దక్కకపోతే మాకు చావే శరణ్యం



**సొళహాళ్ళి(మంత్రాలయం), జూన్ 28, ప్రభాతవార్త:** మా భూమి మాకు దక్కకపోతే మాకు చావే మహిళా రైతు హరిజన ముత్తమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం మహిళా రైతు విలేకరులతో మాట్లాడుతూ మాకు గ్రామంలోని స.నం 19-బి1ఏలో 2.89 ఎకరముల వ్యవసాయ భూమి ఉన్నట్లు తెలిపారు.సుమారు గత 60 ఏళ్ళుగా ఈ భూమిని తామే సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు.అయితే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమకు ఈ స.నం స్థలంలో ఇళ్ళ నిర్మాణానికి పట్టాలు ఇచ్చారని దౌర్జన్యంగా పొలంలోకి వచ్చినట్లు చెప్పారు.తాము మా పొలం విషయంపై 2015లో హైకోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించారు.హైకోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్లు స్పష్టం చేశారు.అప్పటినుండి నేటివరకు తామే పొలాన్ని సాగు చేస్తున్నామన్నారు.2022లో హైకోర్టు పొలం సాగు చేస్తున్న వారిని అడ్డుకోరాదని చెప్పింది.హైకోర్టు తీర్పు అనంతరం రైతు ముత్తమ్మ తమకు పొలం పాస్‌బుక్కులు మంజూరు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకుంది.దీనిపై మంత్రాలయం తహశీల్దార్ వివరణ సైతం ఇచ్చారు.విచారణ పేరుతో గ్రామానికి వచ్చిన తహశీల్దార్ చంద్రశేఖర్ గ్రామంలో కొంతమందికి పట్టాలు మంజూరు చేస్తామని రెచ్చగొట్టినట్లు తెలిపారు.గత ఐదు రోజుల క్రితం కొంతమంది వ్యక్తులు మా పొల ంలోకి దౌర్జన్యంగా వచ్చి ట్రాక్టర్‌తో రాళ్ళు పాతడానికి వచ్చినట్లు తెలియజేశారు.అక్రమంగా మా పొలంలోకి ప్రవేశించి మమ్ములను బెదించిన బోయ వీరేష్‌పై ఎస్‌సి,ఎస్‌టి కేసు నమోదు చేసి మాకు న్యాయం చేయాలని కోరారు.కాబట్టి ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మా పొలం విషయంలో న్యాయం చేయాలని వేడుకున్నారు.

## విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలి



**నందవరం, జూన్ 28, ప్రభాతవార్త:** పిల్లలు క్రమం తప్పకుండా ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ద పెట్టాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే మల్లెశప్ప పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని ఇబ్రహింపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్-టీచర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వం విద్యారంగానికి తీసుకువచ్చిన వివిధ పథకాల గురించి సభ్యులకు వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామనా న్నరు. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం ప్రసన్న కుమారి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆల్‌ఇండియా క్విజ్ పోటీల్లో హొళగుంద విద్యార్థులకు మొదటి బహుమతులు



**హొళగుంద, జూన్ 28, ప్రభాతవార్త :** ఆల్‌ఇండియా క్విజ్ పోటీల్లో హొళగుంద గ్రామానికి చెందిన సందేష్,రాఘవేంద్ర అనే విద్యార్థులకు మొదటి బహుమతులు వచ్చినట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ఎండి నజీర్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ మరియు ఆర్థిక చేరిక అభివృద్ధి విభాగం ఆద్వర్యంలో బుధవారం కల్లూరులో ఆల్ ఇండియా క్విజ్ పోటీలు నిర్వహించారని ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు రెండు బహుమతులు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. మొదటి బహుమతులు పొందిన విద్యార్థులకు రూ.10వేలు నగదు,యోగ్యత సర్టిఫికేట్లను అందచేసినట్లు హెచ్ఎం తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు జులై 14న రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు.

## జగనన్న సురక్ష సర్వే వేగవంతం చేయండి



**హొలహర్వి, జూన్ 28, ప్రభాతవార్త :** జగనన్న సురక్ష సర్వే వేగవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్ రామాంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని కామినహాల్ గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కావున వాలంటరీలు,సచివాలయ ఉద్యోగులు గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి జగనన్న సురక్ష సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా..లేదా..అని కుటుంబ సభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేసి సంక్షేమ పథకాల లబ్దిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే అర్హులైన వారికి కుల, ఆదాయ తదితర సర్టిఫికేట్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ పనులు పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని లబ్దిదారులకు ఆదేశించారు. గ్రామాల్లో సమస్యలు ఏవైన ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. ఆయన వెంట ఎంపిడిఓ ఆంటోని,తహశీల్దార్ మల్లికార్జున స్వామి,ఈఓపిఆర్‌డి మల్లికార్జున,విఆర్ఓ రాఘవేంద్రస్వామి,సచివాలయ ఉద్యోగులు,వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగూడూరు గ్రామం వద్ద కొసాగుతున్న ఎన్‌హెచ్340సి విస్తరణ పనులు

-నష్టపరిహారం కోసం బాధితుల ఎదురు చూపులు



**పాములపాడురూరల్, జూన్28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రగూడూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి 340సి రహదారి విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మండల పరిధిలో జాతీయరహదారి కృష్ణరావ్‌పేట,జూటూరు,రుద్రవరం, పాములపాడు,కంబాలపల్లి, ఎర్రగూడూరు, బానుమలుపు గుండా వెళుతుంది. జాతీయరహదారి అధికార బృందం ఇప్పటివరకు ఎర్రగూడూరు గ్రామంలోని బాధితులకు మాత్రమే నష్టపరిహారం మంజూరు చేశారు. మిగిలిన గ్రామాలకు నష్టపరిహారం మంజూరు చేయలేదు. నష్టపరిహారం మంజూరు చేసి పునరావాస కల్పనకు ప్రభుత్వ స్థలం కేటాయించి గృహనిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

## సమ్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష



**తుగ్గలి, జూన్ 28, ప్రభాతవార్త :** ప్రజాసమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్,వైస్ ఎంపిపి ఎర్రనాగప్ప,గుంత రఘు,తుగ్గలి మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలి,జి ఎర్రగుడి,జొన్నగిరి గ్రామాలలోని సచివాలయాలలో వాలంటరీలు,గృహసారథులు,సచివాలయ కన్వీనర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికి అందించాలన్నదే వైసిపి ప్రభుత్వ ధ్యేయమన్నారు. వివిధ కారణాలతో మిగిలిన లబ్దిదారులకు మంచి చేయడమే రాష్ట్ర సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష తీసుకొచ్చారన్నారు. అర్హత ఉండి కూడా చిన్నచిన్న కారణాల వల్ల మిగిలిపోయిన వాళ్లకు ఈ కార్యక్రమం ద్వారా లబ్ది చేకూరుస్తామన్నారు. నవరత్నాల ద్వారా కొన్ని కోట్ల రూపాయలు సిఎం జగన్ బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. పేదవాడికి మంచి చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని పేదల పట్ల ప్రేమ చూపిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. తుగ్గలిలో సర్పంచ్ రామాంజనేయులు,సచివాలయ కన్వీనర్లు సత్యప్ప,గృహసారథులు,పంచాయతీ సెక్రటరీ రాజునాయక్,సచివాలయ సిబ్బంది,వాలంటరీలు,జొన్నగిరిలో పక్కీరప్ప,పంచాయతీ సెక్రటరీ గోపాల్,ఎంఎల్ఓ రాజు,సచివాలయ సిబ్బంది, వాలంటరీలు,జి ఎర్రగుడిలో సచివాలయ కన్వీనర్లు గోవిందరాజులు,పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ,సచివాలయ సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

## 30న విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా ధర్నా

**దేవనకొండ, జూన్ 28, ప్రభాతవార్త :** విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా ఈ నెల 30వ తేదీన విద్యుత్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటిశెట్టి,సిపిఐ మండల కార్యదర్శి ఎం నరసరావులు తెలిపారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సప్పుడు కాకుండ చాపకింద నీరులా ప్రజలపై విద్యుత్ భారాలను మోపడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఐదుకోట్ల మంది ప్రజానీకంపై విద్యుత్ భారం మోపడం భాదాకరమన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని వ్యతిరేకిస్తుంటే మన రాష్ట్ర ప్రభుత్వం వంత పాడడం విడ్డూరంగా ఉందన్నారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రాజశేఖర్,కృష్ణ,ప్రజా సంఘాల నాయకులు భాస్కర్,సుల్తాన్,రామాంజి,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కార్యదర్శి

**శిరివెళ్ల, జూన్ 28, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గ్రంధాలయాన్ని బుధవారం జిల్లా కార్యదర్శి ప్రకాష్ తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, గ్రంధాల నిర్వహణ, ప్రముఖుల విజిట్ పుస్తకం, వేసవి విజ్ఞాన కార్య క్రమాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాజ నోటిఫికేషన్లు, మరియు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల ప్రధానమైనటువంటి పుస్తకాల అవసరత గురించి గ్రంధాలయ అధికారిని సుజాత జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లారు.

## ఏపిఆర్‌జెసికి విద్యార్థిని ఎంపిక



**మద్దికెర, జూన్ 28, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలో ఫ్రెండ్స్ విద్యానికేతన్ నందు విద్యను అభ్యసిస్తున్నటువంటి గుత్తి విద్య ఏపిఆర్‌జెసి ఎంట్రన్స్ పరీక్ష ద్వారా ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసి గ్రూపుకు ఎంపికైనట్లు ఫ్రెండ్స్ విద్యానికేతన్ కరస్పాండెంట్ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్బంగా విద్యార్థిని మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించిన మా గురువులకు పాదాభివందనం బైపిసి ద్వారా డాక్టర్ వృత్తిని చేపట్టి భవిష్యత్తులో పేదలందరికి ఉచిత వైద్యం అందచేస్తానని అన్నారు. ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది అభినందించారు.

## పెండింగ్ బిల్లులు వచ్చేలా చూడండి



**చాగలమర్రి, జూన్28, ప్రభాతవార్త:** గ్రామాల్లో హౌసింగ్ పరిధిలో గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్దిదారులకు ఎన్ఆర్ఈజీఎస్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ నాగరాజు కోరారు.బుధవారం చాగలమర్రి ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో మహబూబ్ దౌలా ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ సహాయకులు,ఉపాధి హౌసింగ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో డీఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్దిదారులకు ఇంకా పెండింగ్‌లో ఉన్న ఉపాధి నిధులకు సంబంధించిన రూ.23వేలు వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.జగనన్న లేఔట్లల్లో గృహ నిర్మాణాలు జూలై 15 నాటికి పూర్తియ్యేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ షఫివుల్లా,ఏపీవో నిర్మలా, హౌసింగ్,సచివాలయ,ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - II, AT: TRIVENI COMPLEX, 1st FLOOR, ABIDS, HYDERABAD**
**O. A. No. 329 of 2020**

Between :
**Bank of Baroda,** Nandyal Branch, Kurnool Dist. Rep by its Authorised Officer ...Applicant
And
**M/s. Star Agri Warehousing Collateral Management Ltd & others** ... Defendant/s

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,
44. **Mr. Mandla Swamy Reddy** s/o Late Sri.Mandla Ushen Reddy H.No.4-136, Talamudipi Village, Midthur Mandal, Kurnool Dist
45. **Mr. Mandla Venkata Rami Reddy** s/o Late Sri.Mandla Ushen Reddy H.No.4-136, Talamudipi Village, Midthur Mandal, Kurnool Dist
46. **Mrs. Wudaru Tholasamma** D/o Late Sri.Mandla Ushen Reddy H.No.4-136, Talamudipi Village, Midthur Mandal, Kurnool Dist ...Defendant/s

Please take the summons in the above **O.A. No. 329/2020** filed by the applicant for recovery of money of **Rs.4,5019,847/-** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" daily newspaper and posted the matter to 31/07/2023.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are directed to appear before this Tribunal at Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001 in person or through an Advocate and file Written Statement on **31/07/2023 at 10.30 a.m.** and show cause as to why reliefs prayed for should not be granted.
Take Notice that in case of default the Application will be heard and determined in your absence.
**Given under my hand and seal of this Tribunal on this day 28th of June, 2023.**
*(By order of the DRT-II, Hyderabad)*
**Signature of the Officer Authorized to issue Summons**

